క్లుప్తంగా

సర్వేకు సహకరించాలి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

పాణ్యం: ఓటరు జాబితా సవరణ సర్వేకు అన్ని పార్టీల నాయకులు సహకరించాలని జెడ్పీ సీఈఓ నారసరెడ్డి కోరారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్వేలో వలంటీర్లు పాల్గొనరాదన్నారు. అన్ని రకాల ఓరట్లకు సంబంధించి అర్జీలు స్వీకరిస్తామన్నారు. తర్వాత మార్పులు, చేర్పులుకు కూడా గడువు ఉంటుందన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే చెప్పొచ్చన్నారు. అనంతరం సమీపంలోని ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ అనురాధ పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల

గూడూరు: మండలంలో స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ లక్ష్యాలు–2023 పోస్టర్లను మంగళవారం ఎంపీపీ సునీత, అధి కారులు విడుదల చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మాధవీలత అధ్యక్షతన జరిగిన ఒక కార్యక్రమంలో ఎంపీడీఓ మాట్లాడారు. 2023 ఆర్థిక సంవత్సరానికి మండలంలోని జూలకల్లు, పెంచికలపాడు, మల్లాపురం, చునుగొండ్ల గ్రామాలను కేంద్రం ఎంపిక చేసిందన్నారు. ఐదు గ్రామాలలో పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై ప్రజలకు కేంద్ర బృందం అవగాహన కల్పిస్తుందన్నారు. ఏఓ విజయసింహారెడ్డి, ఈజీఎస్ ఏపీఓ హాసీనా పాల్గొన్నారు.

కల్వర్టును ఢీకొన్న కారు.. ఆరుగురికి తీవ్రగాయాలు

కోడుమూరు రూరల్ : పట్టణ సమీపంలో కల్వర్టును మంగళవారం ఉదయం ఓ కారు వేగంగా ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహారాష్ట్రలోని రానాపురం ప్రాంతానికి చెందిన వామాకాంత్ దేశ్‌ముఖ్, మహేష్, బాలు, సునీల్, జయధన్, ప్రవీణ్ సింధే అనే వ్యక్తులు కారులో తీర్థయాత్రలు చేస్తూ సోమవారం రాత్రి తిరుపతి నుంచి మంత్రాలయం రాఘవేంద్రుడి దర్శనార్థం బయలుదేరారు. ఈ నేపథ్యంలో కోడుమూరు సమీపంలో డ్రైవర్ నిద్రమత్తు కారణంగా వేగంగా రోడ్డు పక్కనున్న కల్వర్టును ఢీకొట్టాడు. కాగా ప్రమాద వేగానికి కారులోని ఎయిర్ బేలూన్లు ఓపెన్ కావడంతో కారులో ముందు కూర్చున వారికి కొంత ప్రమాద తీవ్రత తగ్గింది. కోడుమూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యులు 108వాహనంలో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కుళాయిలు ధ్వంసం

పాణ్యం: మండల పరిధిలోని కందికాయపల్లె గ్రామంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో నాడు–నేడు ద్వారా నూతనంగా నిర్మించిన తాగునీటి కుళాయిలను గుర్తు తెలియని దుండుగులు ధ్వంసం చేశారు. దీంతో విద్యార్థులకు తాగునీటి సమస్య నెలకొంది. విధిలేని పరిస్థితుల్లో బాటిళ్లతో నీటిని తెచ్చుకుంటున్నారు. ఈవిషయమై ఎంఈఓ కోటయ్యను వివరణ కోరగా తాగునీటి సరఫరా లేకపోతే హెచ్ఎందే బాధ్యత అన్నారు.

బురదలో ఇరుక్కున్న బస్సులు

సి.బెళగల్: మండలంలోని తుంగభద్ర నదీతీర గ్రామాల వెళ్లే మూడు ఆర్టీసీ బస్సులు బురదలో ఇరుక్కపోవడంతో విద్యార్థులు, ప్రయాణికులు, వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. తిమ్మందొడ్డి గ్రామం నుంచి కర్నూలు వెళ్తున్న ఆర్టీసీ బస్సు గుండ్రేవుల గ్రామం దాటిన తరువాత ఎదురుగా వస్తున్న బస్సుకు సైడ్ ఇచ్చే తరుణంలో రోడ్డు పక్కనున్న గడ్డితో కప్పడిన గుంతలో ఇరుక్క పోయింది. అయితే కొద్దిగా ముందుకు వెళ్లిన గుండ్రేవుల బస్సు సైతం బురదలో ఇరుక్క పోయింది. మరికాసేపటికి గుండ్రేవుల నుంచి కొండాపురం గ్రామం మీదుగా సి.బెళగల్‌కు విద్యార్థులను తీసుకెళ్లే విద్యార్థి బస్సు అప్పటికే బురుదలో ఇరుక్క పోయిన తిమ్మందొడ్డి బస్సును దాటే క్రమంలో మరోవైపు బురుదలో ఇరుక్క పోయింది. దాదాపు రెండు గంటల పాటు మూడు బస్సులు రోడ్డుకు అడ్డంగా ఇరుక్కపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానికులు, సిబ్బంది సహకారంతో బురదలో ఇరుక్కపోయిన బస్సులను పక్కకు తీయడంతో ఇబ్బందులు తప్పాయని ఆర్టీసీ సిబ్బంది తెలిపారు.

కూలిన మట్టిమిద్దె

సి.బెళగల్: మండల పరిధిలోని కె.సింగవరంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మట్టిమిద్దె పైకప్పు కూలింది. తెలుగు తిక్క నాగేష్, భార్య కిష్టమ్మ పిల్లలతో పాటు తల్లి రంగమ్మతో కలిసి బీసీ కాలనీలో నివాసం ఉంటున్నాడు. వర్షాలకు మంగళవారం ఉదయం ఇంటి పైకప్పు ఒక్కసారిగా కుప్పకూలింది. భార్య కిష్టమ్మతో పాటు, తల్లి రంగమ్మ బయటకు వచ్చిన మరుక్షణమే మిద్దె కూలడంతో ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు.


దుప్పట్ల పంపిణీ

కర్నూలు (న్యూటౌన్): దివంగత ఎమ్మెల్యే శిఖామణి వర్ధంతి సందర్భంగా నగర శివారులోని మునగాలపాడులో మంగళవారం ఆయన కుమారుడు మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వృద్ధులకు సూచించారు. కార్యక్రమంలో శిఖామణి పెద్దకుమారుడు మణిబాబు, రిటైర్డ్ విశ్రాంత బ్యాంకు ఉద్యోగి ఏసేపు తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి నింపుతూ.. పౌరుషాన్ని చాటుతూ

- వీరజవానుల గ్రామం మిలిటరీ కాలనీ
- రెండో ప్రపంచ యుద్ధానికి జిల్లా నుంచి 72 మంది
- పదవీ విరమణ అనంతరం వారికి ఇళ్లు కట్టించి ఇచ్చిన అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం





మిలిటరీ కాలనీ ఏరియల్ వ్యూ

1939 – 1945. అది రెండో ప్రపంచ యుద్ధ కాలం. బ్రిటీష్ ప్రభుత్వం భారతదేశంలోని నలుమూలల నుంచి సైన్యంలోనికి యువతను రిక్రూట్ చేసింది. శరీర దారుఢ్యం కలిగిన వారు చాలా మంది సైన్యంలో ఆసక్తిగా చేరారు. రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొని వీరోచితంగా పోరాడారు. అనంతరం పదవీ విరమణ పొంది స్వదేశానికి తిరిగొచ్చారు. వారి కోసం అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం కానుకలను సమర్పించింది. అందులో భాగంగా 1948లో కర్నూలు జిల్లా కేంద్రానికి 12 కిలో మీటర్ల దూరంలో ఒక్కొక్కరికి 9 సెంట్ల స్థలం కేటాయించి, 3 సెంట్లలో ఇళ్లు నిర్మించి ఇచ్చింది. దానిపేరే మిలిటరీ కాలనీ. ఇంటితో పాటు కేడర్‌ను బట్టి 3 నుంచి 8 ఎకరాల పొలం, ఆవు కానుకగా ఇచ్చింది. కాలక్రమంలో వారు వయసుపైబడి మృతిచెందగా ప్రస్తుతం వారి కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. కాగా యుద్ధవీరుల భూములు అన్యాక్రాంతానికి గురయ్యాయి. వారి కుటుంబ సభ్యులు కొందరు పోరాడి దక్కించుకోగా, మరికొందరు ఇంకా పోరాడుతూనే ఉన్నారు.

– కర్నూలు (న్యూటౌన్)

నాన్నే స్ఫూర్తి



మా నాన్న డేవిడ్ రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్నారు. దేశం కోసం ఆయన చేసిన సేవను ఎన్నటికీ మరువను. ఆయన స్ఫూర్తితోనే నేను ఆర్మీలో చేరాను. దేశ రక్షణలో నేను సైతం ఉండాలన్నదే నా ఆశయం.

– పోలుకంటి జాషువా

దేశసేవలో నేను సైతం



రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న జిల్లాకు చెందిన 72 మందిలో మా నాన్న బండి ఏసుదాసు ఒకరు. వారు కుటుంబ సభ్యులను వదిలి, ప్రాణాలకు తెగించి రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్నారు. మా నాన్న బాటలో నడవాలన్నది నా లక్ష్యం. అందుకే ఆర్మీలో చేసి దేశ సేవల పాలుపంచుకుంటున్నాను.

– బండి సుందర్‌రావు

మా నాన్న యుద్ధంలో పాల్గొన్నాడు



మాది కొత్తపల్లె మండలం ఎం లింగాపురం. మా నాన్న సీహెచ్ పౌలు 1942 నుంచి 1946 వరకు నాలుగేళ్ల రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్నారు. నాన్న తిరిగొస్తారో లేదోనని ఎంతో కుమిలిపోయేవాళ్లం. క్షేమంగా తిరిగి రావడంతో సంతోషించాం. యుద్ధంలో పాల్గొన్నందుకు మానాన్నకు బ్రిటీష్ ప్రభుత్వం మిలిటరీ కాలనీలో ఇల్లు, పొలం ఇచ్చింది. అనంతరం 1991లో మానాన్న కాలం చేశారు. ఆయన యుద్ధంలో పాల్గొనడం మాకు గర్వంగా ఉంది.

– అగస్టీన్, మిలిటరీ కాలనీ

మా తాత త్యాగం మరువలేనిది



మా తాత పుల్లన్న చివరి మూడేళ్లు రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్నాడు. యుద్ధానికి వెళ్లి తాత ప్రాణాలతో తిరిగి రావడం నమ్మలేకపోయాం. మా తాత త్యాగం ఎన్నటికీ మరువలేనిది. యుద్ధం చేసి తిరిగి రావడంతో అప్పటి ప్రభుత్వం సాగు భూమి, నివాస స్థలం ఇచ్చారు. ప్రస్తుతం మేము మిలిటరీ కాలనీలోనే నివాసం ఉంటున్నాం.

– విజయుడు, మిలిటరీ కాలనీ

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కోడుమూరు రూరల్ : మండలంలోని ముడుమలగుర్తి గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమానికి కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు వివరిస్తారన్నారు. అదేవిధంగా ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు.

కొండలలో పంటలు సాగుచేస్తే చర్యలు

సి.బెళగల్: మండలంలో పచ్చిక బయళ్లుగా ఉన్న కొండప్రాతాలలో ఎవరైనా పంటలను సాగుచేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ శేషఫణి హెచ్చరించారు. కొన్ని రోజులుగా కొండ ప్రాంతాలలో సాగుపై సి.బెళగల్ గ్రామ పెద్దలు, గొర్రెల కాపర్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ ఆదేశాల మేరకు వీఆర్వోలు కొండ ప్రాతాలను ఆక్రమించుకున్న వారికి ఆపాలని నోటీసలను జారీ చేశారు. అయినప్పటికీ కొంత మంది పంటలను విత్తుతుండటంతో మంగళవారం గ్రామ పెద్దలు కట్టమీది రాముడు, పెద్ద మునెప్ప, కటిక మాబులు, ముల్లషుకూర్, కురువ వెంకటరాముడు, తెలుగు సుంకన్న, కురాకుల దుబ్బన్న, దుబ్బబాబు ఖాజ తదితరులు గొర్రెల కాపర్లతో కలిసి తహసీల్దార్‌కు భూ ఆక్రమణ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పెద్దలతో మాట్లాడుతూ పచ్చిక బయళ్లపై ఎవరికి ఎలాంటి హక్కులు లేవని, పంటలు సాగు చేయకూడదన్నారు. పంటలు సాగుచేసిన ప్రాంతాలలో పశువులు, గొర్రెలను మేపుకోవచ్చని తేల్చి చెప్పారు. కొండ ప్రాంతాలలో మేపును అడ్డుకునే వారిపై కఠిన చర్యలు ఉంటాయని తహసీల్దార్ హెచ్చరించారు. కార్యక్రమంలో గొర్రెల కాపర్ల సంఘం అధ్యక్షుడు గజ్జి రాముడు, ఉపాధ్యాక్షుడు నరసింహుడు, సభ్యులు పాండు, వెంకటేష్, మద్దిలేటి పాల్గొన్నారు.

భూముల రీ సర్వేకు సహకరించండి

- జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య



అధికారులకు సూచనలిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు (న్యూటౌన్): మండల పరిధిలో జరుగుతున్న భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య కోరారు. మంగళవారం సాయంత్రం దిగువపాడు గ్రామ పరిధిలో జరుగుతున్న రీ సర్వేను ఆమె తనిఖీ చేసి సర్వేయర్లకు పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ భూముల రీ సర్వే పూర్తి చేసి రైతులకు జగనన్న శాశ్విత భూ హక్కు పత్రాలు పంపిణీ చేస్తామన్నారు. ఇకపై గ్రామాల్లో ఆధునిక డిజిటల్ రికార్డులను సిద్ధం చేస్తున్నామన్నారు. రైతులకు శ్రమ, ఆర్థిక భారం లేకుండా భూ హక్కు పత్రాలను సిద్ధం చేసేందుకు అధికారులు సమాయత్తం కావాలన్నారు. జేసీ వెంట కర్నూలు రూరల్ తహసీల్దార్ ఆర్ శివరాముడు, ఏడీ సర్వే మోహన్, డీఐ సుబ్బారెడ్డి, వీఆర్‌ఓలు, వీఆర్ఏలు, రైతులు పాల్గొన్నారు.

పాణ్యం చేరిన పాదయాత్ర



పాదయాత్రకు సంఘీభావం తెలుపుతున్న ఎంపీపీ ఉసేన్‌బీ, నాయకులు

పాణ్యం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు షేక్ జిలానీ బాషా మార్కాపురం నుంచి ఇచ్చాపురం వరకు చేపట్టిన పాదయాత్ర మంగళవారం పాణ్యం చేరుకుంది. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయనకు స్వాగతం పలికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం వద్ద షేక్ జిలానీ బాషా మాట్లాడుతూ 'ఉండాలి జగన్.. ఉంటాడు జగన్' నినాదంతో ఈ నెల 15న తన స్వగ్రామం మార్కాపురం నుంచి ప్రజా సంక్షేమ యాత్ర ప్రారంభించానన్నారు. ఐదు నెలల్లో ఇచ్చాపురం చేరుకుంటానన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందుతోందన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా పాలన సాగించిన నాయకుడు జగనన్న ఒక్కరేనన్నారు. ఆయన మరోసారి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉసేన్‌బీ, మండల కన్వీనర్ గుద్దేటి సుమంత్ రెడ్డి, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు జాకీర్‌ఉసేన్ పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

గడప గడపకూ లబ్ధి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ప్రభుత్వ పథకాలతో గడప గడపకూ లబ్ధి చేకూరిందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం బస్తిపాడు గ్రామంలో కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, సర్పంచ్ రవి, ఎంపీటీసీ సభ్యుడు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని ఇంటింటికి వెళ్లి వృద్ధులను, మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ సంక్షేమ పథకాల వల్ల పొందిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలని, ప్రజా సమస్యలు పరిష్కారించేందుకే గడప గడపకు వస్తున్నామని చెప్పారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించాలని గ్రామస్తులు కోరగా వీలైనంత త్వరగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. టీడీపీ పాలనకు జగనన్న పాలనకు తేడా గమనించి వచ్చే ఎన్నికల్లో ఓటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోయ శారద, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రేణుక, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కేశవరెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, నాయకులు రామోహన్‌రెడ్డి, గిడ్డయ్య, చింతారెడ్డి, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తాం



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

మండల పరిధిలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం బస్తిపాడు గ్రామంలో రూ.50 లక్షలతో నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కాలువ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ రెండు కళ్లుగా పాలన సాగుతుందన్నారు.

ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు

కోడుమూరు రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజల ఇంటి ముంగిటనే సంక్షేమ పథకాలు అందజేస్తోందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని ముడుమలగుర్తి గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వం నాలుగేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు ప్రజలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. శ్మశ్మానికి స్థలాన్ని కేటాయించాలని, సీసీ రోడ్లు, మురుగునీటి కాల్వలు నిర్మించాలని, పాత ఇండ్ల స్థానంలో కొత్తవి నిర్మించుకునేందుకు గృహాలు మంజూరు చేయాలని ముడుమలగుర్తి గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చిన ఎమ్మెల్యే ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

దళారీ వ్యవస్థను రూపుమాపిన ఘనత జగనన్నదే

ముడుమలగుర్తి గ్రామంలో విస్తృతంగా పర్యటించిన అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. గత టీడీపీ పాలనలో ఏ పథకం పొందాలన్న జన్మభూమి కమిటీలను, మధ్య దళారీలను ఆశ్రయించాల్సి ఉండేదని గుర్తు చేశారు. దళారి వ్యవస్థను రూపుమాపి నేరుగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సీఎం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. వలంటీరీ వ్యవస్థను అవహేళన చేస్తూ మాట్లాడుతున్న పవన్ కల్యాణ్‌ను వత్తాసు పలుకుతున్న చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే ప్రజలకు పిలుపునిచ్చారు. తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మధు, ప్రహ్లాదరెడ్డి, మధుమోహన్‌రెడ్డి, లాయర్ ప్రభాకర్, మల్లేష్, మద్దిలేటి పాల్గొన్నారు.



మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

'జగనన్న సురక్ష'తో ప్రజలకు మేలు

- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



జగనన్న సురక్షలో భాగంగా ప్రజలకు సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డా.సుధాకర్

కోడుమూరు రూరల్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంతో పేదలకు ఎంతో మేలు జరుగుతుందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ తెలిపారు. మేజర్ గ్రామ పంచాయతీ కోడుమూరు కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ జయన్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. 1056మందికి 11రకాల సర్టిఫికెట్లతో పాటు కౌలు, బియ్యం కార్డులను ఎమ్మెల్యే చేతుల మీదుగా వారు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ సర్టిఫికెట్ పొందాలన్న ప్రజలు రోజుల తరబడి సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, అయితే జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేస్తున్నారన్నారు. నాలుగేళ్ల పాలనలో కోడుమూరు నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.200కోట్లకు పైగా ఖర్చు చేసిందని గుర్తు చేశారు. కోడుమూరు శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం రూ.34కోట్ల నిధులను మంజూరు చేసిందని, టెండర్లు పూర్తయిన వెంటనే పనులు మొదలు పెడతామన్నారు. ప్రజలకు చేసే మేలును చంద్రబాబు, పవన్ కల్యాణ ఓర్వలేకనే వలంటీర్లపై అసత్యారోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. వలంటరీ వ్యవస్థను ప్రజలు సమర్థిస్తున్నారని, పవణ్ ఆరోపణలకు ప్రజలే తగిన బుద్ధి సరైన సమయంలో చెబుతారని ఎమ్మెల్యే హెచ్చరించారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్, డీటీ రామాంజినేయులు, ఈఓ అజయ్‌భాస్కర్, మార్కెట్‌యార్డు డైరెక్టర్ ఇమ్మానేయులు, వైఎస్సార్‌సీపీ నేతలు లాయర్ ప్రభాకర్, మధుమోహన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కౌలుట్ల, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

కర్నూలు (న్యూటౌన్): కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. సంతోష్‌నగర్‌లో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పలువురికి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల ద్వారా పరిష్కారం కాని సమస్యలను జగనన్న సురక్ష కార్యక్రమలో పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈకార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. గతంలో ఏ సర్టిఫికెట్ కావాలన్నా కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వచ్చేదన్నారు. ఒక్కోసారి దళారులకు అంతో ఇంతో సమర్పించుకుంటే తప్ప సర్టిఫికెట్ చేతికందేది కాదన్నారు. జగనన్న ప్రభుత్వంలో పైసా ఖర్చు లేకుండా, దళారుల ప్రమేయం లేకుండా, తక్కువ సమయంలోనే సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. జగనన్న ప్రవేశపెట్టి సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ఇతర రాష్ట్రాలు సైతం ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. అలాంటి వ్యవస్థలపై ఆరోపణలు చేసిన చంద్రబాబు, పప్పు నాయుడు లోకేష్‌బాబు, దత్త పుత్రుడు, ప్యాకేజ్ స్టార్ పవన్ కల్యాణ్‌కు వచ్చే 2024 ఎన్నికల్లో బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, స్పెషల్ ఆఫీసర్ సాదిక్‌హుస్సేన్, కార్పొరేటర్లు విక్రమసింహారెడ్డి, శ్వేతారెడ్డి పాల్గొన్నారు.



సంతోష్‌నగర్‌లో లబ్ధిదారుకు ధ్రువపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్



సోమయాజులపల్లెలో ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

సోమయాజులపల్లెలో..

ఓర్వకల్లు: మండలంలోని సోమయాజులపల్లె గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, ఎంపీడీఓ శివనాగప్రసాద్, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు తదితరులు హాజరై పలువురికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ లోటర్ బాషా, సర్పంచు జయమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు శేషమ్మ, పంచాయతీ కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



గని గ్రామంలో ఉచితంగా ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, అధికారులు


గనిలో..

గడివేముల: మండల పరిధిలోని గని గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీపీ నాగమద్దమ్మ, సర్పంచ్ కత్తి తులశమ్మ తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో 450 మందికి ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, ఈఓఆర్‌డీ కాలిక్ పాల్గొన్నారు.

తమ్మరాజుపల్లె, కందికాయపల్లె గ్రామాల్లో..

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె, కందికాయపల్లె గ్రామాల్లో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీపీ ఉసేన్‌బీ పాల్గొని పలువురికి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు విజయగౌరి, రామచంద్రుడు, ఎంపీటీసీ సభ్యులు వెంకటేశ్వర్లు, రమణయ్య, మండల సచివాలయాల కన్వీనర్ గుద్దేటి సుమంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శేషిరెడ్డి, శేషయ్య, తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, ఎంపీడీఓ దస్తగిరి పాల్గొన్నారు.

అర్జీ పెట్టిన వెంటనే బియ్యం కార్డు మంజూరు



నా కుమారుడి పెండ్లి ఇటీవలే జరగడంతో కొత్త బియ్యం కార్డుకు వలంటీర్ చేత అర్జీ పెట్టించా. అర్జీ పెట్టిన వెంటనే అధికారులు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా బియ్యం కార్డును మంజూరు చేయడం సంతోషంగా ఉంది. గతంలో బియ్యం కార్డు పొందాలంటే నెలల తరబడి ఎదురు చూడాల్సి వచ్చేది. అయితే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోని వచ్చాక ఏ పథకంమైనా మా ఇంటి వద్దకే వలంటీర్ల ద్వారా చేరుతుండడం సంతోషంగా ఉంది.

– చంద్రన్న, కోడుమూరు.

రెండు రోజుల్లోనే సర్టిఫికెట్లు



గతంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ఎన్నో వ్యయ ప్రయాసాలకు ఓర్చుకుని, డబ్బు ఖర్చు చేసుకుని కార్యాలయాల చుట్టూ తిరిగేవాళ్లం. ప్రస్తుతం ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. రెండు రోజుల క్రితం వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి దరఖాస్తులు స్వీకరించింది. ఈరోజు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారు.

– మిర్యాల పార్వతి, సంతోష్‌నగర్, కర్నూలు

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

కోడుమూరు: ఉపాధ్యాయలు సమయాన్ని వృథా చేయకుండా విజ్ఞానాన్ని పరస్పరం పంచుకుని విద్యాభివృద్ధికి కృషి చేయాలని డీఈఓ రంగారెడ్డి సూచించారు. మంగళవారం కోడుమూరులోని బాలుర హైస్కూల్‌ను డీఈఓ సందర్శించి ఐఎఫ్‌పీ ప్యానెల్స్‌ను ప్రారంభించారు. ఉపాధ్యాయులకు జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తోందన్నారు. ఐఎఫ్‌పీ ప్యానెల్స్‌ను ఉపాధ్యాయులు ఉపయోగించుకుని విద్యార్థులకు నాణ్యమైన బోధనను అందించాలన్నారు.



కోడుమూరు బాలుర హైస్కూల్లో ఐఎఫ్‌పీ ప్యానెల్స్‌ను ప్రారంభిస్తున్న డీఈఓ రంగారెడ్డి